

# 5. వెదకబోయిన తీగ

**పాఠంలోకి ప్రవేశించేముందు:**


సామెతలు లేదా లోకోక్తులు ప్రజల భాషలో సందర్భానుసారంగా వాటికవే దొర్లుతుంటాయి. వీటిలో భాషా సౌందర్యం, అనుభవసారం, నీతి, సూచన, హాస్యం కలగలిపి ఉంటాయి. ''సామెతలు''ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. ఇవి లేని భాష/మాట నిస్సారం. అందుకే ''సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు'' అంటారు. సామెతలకు ఏ ఒక్కరినీ రచయితగా చెప్పలేము. ప్రజలు తమ అనుభవాల్లో నుంచే సామెతలను పుట్టిస్తారు.

ప్రస్తుత పాఠ్యభాగం ద్వారా 'వెదకబోయిన తీగ'' అనే సామెత ఎలా వచ్చిందో తెలుసుకుందాం.

ఒక గ్రామంలో ఒక ధనవంతుడు ఉండేవాడు. ధనంలో కుబేరుడంతటివాడు. ఓసారి అతని వీపులో చిన్న గాయం అయ్యి పుండుగా మారింది. మొదట ఆయన తనకు తెలిసిన చిట్కావైద్యాలేవో చేశాడు. కానీ ఏ మాత్రం తగ్గకుండా ఆ పుండు మరింత పెద్దదైంది.

ఆ ధనవంతునికి ఒక కొడుకున్నాడు. తండ్రి పుండును మాన్పింపజేసేందుకై ఎంతో మంది వైద్యులను రప్పించి వైద్యం చేయించాడు. ఫలితం దక్కలేదు. వీపులో పుండు ఎప్పటిలాగే ఉండి ఆయన్ని తీవ్ర అవస్థకు గురి చెయ్యసాగింది. పెద్ద పెద్ద వైద్యులు సైతం ఆ పుండును మాన్పడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

ఇదిలా ఉండగా ఒకరోజు ఆ ఊరికి ఒక మునీశ్వరుడు వచ్చాడు. ఆయన ఎంతో మహిమ గల వాడని విన్న ధనవంతుని కొడుకు ఆయన్ని కలుసుకుని తన తండ్రి విషయం చెప్పి ''మీరు తపస్సంపన్నులు. ఎలాగైనా మా తండ్రిగారి పుండుని మాన్పి ఆయన బాధను నివారించండి'' అని వేడుకున్నాడు.



మునీశ్వరుడు సరేనని అతనితో ఇంటికి వెళ్లాడు. చాలాసేపు ధనవంతుని పుండును పరిశీలించి ''ఈ పుండు మామూలు ఔషధాలకు లొంగేది కాదు. సాధారణంగా ఆ

తీగ దట్టమైన అడవులలోను, పర్వత ప్రాంతాల్లోనూ లభిస్తుంది. ఆ తీగ ఆకులను తెచ్చి వాటి పసరును పుండు మీద పోస్తే కొద్ది రోజుల్లోనే మానిపోతుంది'' అని చెప్పి ఆ తీగ ఆకులు ఎలా ఉంటాయో, దానినెలా గుర్తించాలో వివరంగా చెప్పాడు.

ధనవంతుని కుమారుడు ఆ తీగ ఆకులను తీసుకొని రావడానికి ప్రయాణమయ్యాడు. తనకు కావలసిన ఆహార పదార్థాలను సమకూర్చుకుని మునీశ్వరుడి ఆశీర్వాదం పొంది బయలుదేరాడు.

ఇంటినుండి కొంతదూరం వెళ్లాడు. అక్కడ దారికి రెండువైపులా దట్టంగా మొక్కలు పెరిగాయి. వాటి మధ్యనుండి ముందుకు నడుస్తుండగా అతని కాలికి ఏదో తీగ చుట్టుకుని అదుపు తప్పి దభీలుమని క్రింద పడిపోయాడు.

తనకాలికి తగిలిన ఆ తీగను పరిశీలనగా చూశాడు. మునీశ్వరుడు చెప్పిన ఆనవాలుకు ఆ తీగ సరిగ్గా సరిపోయింది. వెంటనే వెనక్కి వెళ్లి మునీశ్వరుడికి విషయం చెప్పి ఆ తీగను చూపించాడు. అప్పుడు మునీశ్వరుడు ''మనకు కావలసిన తీగ ఇదే! నువ్వు వెదకబోయిన తీగ నీ కాలికే తగిలింది'' అని చెప్పి ఆ తీగ ఆకుల పసరుతో ధనవంతుడి పుండుకు చికిత్స చేశాడు.

వారంరోజుల్లోనే ధనవంతుడు కోలుకున్నాడు. పుండు మానిపోయింది. అప్పట్నుంచి ''వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు'' అన్న సామెత వాడుకలోకి వచ్చింది.

---

**I. వినండి-సంభాషించండి:**

1. ధనవంతుడు దేనితో బాధపడుతుండేవాడు ?
2. ధనవంతుని కుమారుడు వైద్యులను ఎందుకు రప్పించాడు?
3. మునీశ్వరుడు ఎలాంటివారు ?
4. ధనవంతుని కుమారుడు ఎక్కడకు ప్రయాణమయ్యాడు ?

**II. చదవండి-ఆలోచించండి-రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం.**

అవస్థ = బాధ; పసరు = ఆకురసము, పచ్చిక

**III. కృత్యము**

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదవి సూచనానుసారంగా కృత్యాలు చేయండి.**



**అ. తప్పొప్పులు గుర్తించి రాయండి.**

1. ఆయన తనకు తెలిసిన చిట్కా వైద్యా లేవో చేశాడు.
2. ఆ పుండు మరింత చిన్నదైంది. 3. ఆ ఊరికి ఒక కవీశ్వరుడు వచ్చాడు.
4. ఆధనవంతునికి ఒక కొడుకున్నాడు.

(పరిచ్ఛేదం : పుట సంఖ్య.... 47 లోని ''ఒక గ్రామంలో.... వేడుకున్నాడు'' వరకు)

**ఆ. గీతగీసిన పదాలకు బదులుగా కుండలీకరణంలోని సరైన పదాన్ని ఎన్నుకొని పూర్తి వాక్యాన్ని రాయండి.**
**(ధనం, అవస్థ, పరిశీలించి, ధనవంతుని, తండ్రి)**

1. పుండు ఆయన్ని తీవ్ర బాధకు గురిచేయసాగింది. 2. మా నాన్న గారి పుండును మాన్పించండి.
3. సంపదలో కుబేరుడంతటి వాడు 4. భాగ్యవంతుని కొడుకు ఆయన్ని కలుసుకున్నాడు.

**ఇ. వాచకములు గుర్తించి రాయండి.**

1. గ్రామం 2. ధనవంతుడు

**ఈ. స్వీయ స్పందన.**

''నువ్వు పాఠశాలకు వెళ్తుండగా, నీ స్నేహితుడు అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడి పోయాడు.'' నీవు అతనికి ఏవిధంగా చికిత్స చేస్తావు?

## IV. వినండి-చర్చించండి-రాయండి.

### అ. జవాబులు రాయండి.

1. ధనవంతుని కుమారుడు వైద్యం చేయించిన విధము చర్చించండి.
2. మునీశ్వరుడు – ధనవంతుని కుమారుడు మధ్య జరిగిన సంభాషణ రాయండి.
3. ధనవంతుని కుమారుడు పర్వతాలకు వెళ్లే మార్గంలో జరిగిన సంఘటనను చర్చించండి.
4. ధనవంతుడు కోలుకున్న విధము రాయండి.

### ఆ. ఎవరు ఎవరితో పలికిరి

1. "మా తండ్రిగారి పుండును మాన్పి ఆయన బాధను నివారించండి" ________ – ________
2. "వింధ్య పర్వతాలలోని తీగ ఆకులను తెచ్చి పసరు పుండు మీద వేస్తే పుండు మానిపోతుంది"
________ – ________

### ఇ. జతపరచి రాయండి:

| 'క' వర్గం | 'చ' వర్గం |
|---|---|
| 1. దారికి రెండు వైపులా | అ. నీకాలికే తగిలింది |
| 2. వీపులో చిన్న గాయంఅయ్యి | ఆ. లొంగేది కాదు |
| 3. నువ్వు వెదక బోయిన తీగ | ఇ. పుండుగా మారింది. |
| 4. ఈ పుండు మామూలు ఔషధాలకు | ఈ. దట్టంగా మొక్కలు పెరిగాయి. |

### ఈ. అల్లిక:

ధనవంతుని పుండు గురించి మునీశ్వరుడు చెప్పినది – ________ – ________ – ________ – ________

## V. స్వీయ వ్యక్తీకరణ:

1. నీకు వచ్చిన జలుబు, జ్వరం తగ్గించడానికి ఇంట్లో చేసే వైద్యం గురించి రాయుము.
2. ఏవేని అయిదు ఔషధ మొక్కలు – వాటి ఉపయోగాలు రాయుము.

## VI. భాషావగాహన

### అ. కింది వాక్యములలో గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి.

1. <u>మునీశ్వరుడు</u> సరేనని అతనితో ఇంటికి <u>వెళ్ళాడు</u>.
మునీశ్వరుడు = ________ వెళ్ళాడు = ________

### ఆ. వాక్యాంగాలు రాయండి.

1. ఆయన తనకు తెలిసిన చిట్కా వైద్యాలను చేశాడు.
2. ధనవంతుని కుమారుడు తీగ ఆకులను తెచ్చాడు.

### ఇ. కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించండి.

1. విఫలమగుట 2. సమకూర్చుట 3. ఆశీర్వాదము

### ఈ. సామాన్య/సంయుక్త వాక్యాలను రాయండి.

1. ఎంతో మంది వైద్యులను రప్పించి వైద్యం చేయించాడు కాని ఫలితం దక్కలేదు.
2. మునీశ్వరుడు అతనితో ఇంటికి వెళ్ళాడు.

ఉ. సంధి చేసి రాయండి.

1. వైద్యాలు + ఏవో = 2. ముని + ఈశ్వరుడు = 3. దట్టము + ఐన = 4. దానిని + ఎలా =

## VII. సృజనాత్మకత:


అ. 1. సామెతలను సేకరించి వాటికి సంబంధించిన కథలను అంతర్జాలంలో వెదకి రాయండి.

2. సామెతలను రాసి వాటికి సమానమైన ఆంగ్ల సామెతలను రాయండి.

3. మీకు తెలిసిన మరొక సామెత పుట్టుక గురించి రాయండి.

ఆ. పోలికలు – తారతమ్యాలు

కింది చిత్రాలను గమనించండి. అందులోని పోలికలు – వ్యత్యాసాలను రాయండి.






నేనిది నేర్చుకున్నా

పరిసరాలలో ఉన్న ఎన్నో ఔషధమూలికల మొక్కలు అమూల్యమని తెలుసుకున్నా!

9J4DMD

**వి.సూ:** మరికొన్ని సామెతల గురించి అంతర్జాలం శోధించి అర్థాన్ని తెలుసుకోండి.